ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (మంగళ)	సా.6.20
	సహరి (బుధ)	ఉ.4.53



ఎమ్మెల్సీగా సోము వీర్రాజు



అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి సోము వీర్రాజును వరించింది.. బీజేపీ నుంచి ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో సోమవారం రాజధానిలో నామినేషన్ దాఖలు చేశారు. గత 2015లో ఒకసారి టీడీపీ బీజేపీ పొత్తు నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. ప్రస్తుతం కూటమితో పొత్తు నేపథ్యంలో ఈసారి ఎమ్మెల్సీ పదవి వరించింది.. దీంతో జిల్లాలో బీజేపీ బలం పెరిగింది. - మెయిన్‌లో

స్వామిని కోరుకొండ!

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.. కొండపై ఉన్న స్వామిని కొలిచేందుకు 615 మెట్లు ఎక్కి తండోపతండాలుగా భక్తజనం తరలివెళుతున్నారు.. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం స్వామి రథోత్సవం నిర్వహించారు.. పెద్ద ఎత్తున భక్తజనం గోవిందా..గోవింద అంటూ స్వామి రథాన్ని లాగారు.. రాత్రి ఆలయంలో కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై కొలిచారు.. ఓం నమో నారసింహాయ అంటూ మొక్కారు.. ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తారు. 6





సాగుతున్న రథోత్సవం.. మొక్కుతున్న భక్తజనం

ఆయువేగం!

స్పీడుగా..పోతున్నారు!

- యువత ప్రాణాలు తీస్తున్న అతివేగం
- 3 నెలల్లో 75 మంది వరకూ మృతి
- అంతా 18 నుంచి 30 ఏళ్ల లోపువారే
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు
- ఎక్కువ సీసీ బైక్‌లే కారణం
- తల్లిదండ్రులూ తగ్గించాల్సిందే మరి

చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను అతలాకుతలం చేసేస్తోంది.. కుటుంబాలను తీరని దుఃఖంలో ముంచేస్తోంది.. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే కనురెప్పల మాటున కన్నీటిని అదిమిపెట్టుకుని జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారెందరో.. కష్టాలు తీరుస్తాడని.. తమకు అండగా ఉంటాడని.. తమను పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని ఎదురుచూస్తుంటే.. చేతికందివచ్చిన కొడుకు లేడు.. ఇక తిరిగి రాడంటే ఎంత కష్టం.. ఆ బాధను ఆపడం ఎవరితరం.. అయితే ప్రస్తుత యువత మాత్రం ఇవేమీ ఆలోచించడం లేదు.. వాయువేగంగా వెళ్లిపోతున్నారు.. 18 నుంచి 30 ఏళ్ల మధ్యే ప్రాణాలను బలిపెడుతున్నారు.. ఈ మూడు నెలల్లోనే సుమారు 75 మంది యువత మృత్యువాతపడింది. ఈ ఆయువేగానికి కారణం ఎవరు.. ముందు తల్లిదండ్రులే. స్టేటస్ పేరుతో ఎక్కువ సీసీ బైక్‌లు కొనిచ్చేస్తున్నారు.. ఉడుకురక్తం.. ఆ బైక్‌పై రయ్ రయ్‌మంటూ వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. తల్లిదండ్రులూ యువతే కాదు.. మీ పిల్లలకు తెలియజెప్పాలి. అతివేగం ప్రమాదమని హెచ్చరించాలి.



ఇక మాకు దిక్కెవరయ్యా : ప్రత్తిపాడు వద్ద ప్రమాదంలో మృతిచెందిన కుమారుడి వద్ద తల్లి రోదన





వేగం తీసిన ప్రాణాలు

నిన్న ఒక్కరోజే..

- లారీని ఢీకొన్న బైక్ యువకుడి మృతి
- బైక్ స్కిడ్ అయి ఇంటర్ విద్యార్థి మృతి 7



జగ్గంపేట వద్ద ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి

అమలాపురం/రాజమహేంద్రవరం/పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం జరిగితే జీవితాలు గల్లంతే. ఆ ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే అప్పటిదాకా సాఫీగా సాగిపోతున్న కుటుంబం ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ.. లేకలేక పుట్టిన కొడుకు, అల్లారుముద్దుగా పెంచుకొన్న కొడుకు, చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం జీవితాంతం దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని రోజులు వెళ్లదీయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకులు అత్యధికంగా మృత్యువాతపడ్డారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలన్నీ ఆందోళన కలిగిస్తుండగా, వీరి కుటుంబాలు గర్భశోకంతో తల్లడిల్లిపోతున్నాయి. ఈ విషాద ఘటనల్లో ఎక్కువశాతం అతివేగం లేదంటే ఏమరుపాటు కారణాలవ్వడం గమనించాల్సిన విషయం. అలాగే అత్యధిక ప్రమాదాల్లో మరణిస్తున్న యువకులు హెల్మెట్ ధరించకపోవడమూ మరో కారణం. మద్యం లేదా గంజాయి మత్తులో కొందరు కుర్రాళ్లు రాత్రిళ్లు మితిమీరిన వేగంతో వెళ్లి ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడంతో చనిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. బైక్ రేసింగ్ మరో కారణంగా కనబడుతోంది. ఇలా అనేక రకాలుగా యువత రోడ్డు ప్రమాదాల్లో మరణించి ఆయా కుటుంబాలను శోకసంద్రంలో ముంచెత్తుతున్నారు. దీనిపై అధికారుల పూర్తి పర్యవేక్షణ లేకపోవడం, కొన్నిచోట్ల హెచ్చరికలు చేస్తున్నా యువకులు లక్ష్యపెట్టకపోవడం వల్ల కూడా వారి ప్రాణాలను బలి తీసుకుంటున్న ఘటనలు కనిపిస్తున్నాయి.

బైక్ ప్రమాదాలే అధికం

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ఉండేవి ద్విచక్ర వాహనాలే. గతేడాది ఒక్క తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీసు రికార్డుల ప్రకారం మొత్తం ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ఘటనలు 276 ఉండగా.. కార్లు 175, లారీలు 114, ఆటోలు 56, ఆర్టీసీ బస్సులు 24, ప్రైవేటు బస్సులు 17 ఉన్నాయి. జాతీయ రహదారులపై 288, ఇతర రోడ్లపై 243 ప్రమాదాలు జరిగాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల నడుమ 90 శాతం ప్రమా దాలు నమోదయ్యాయి. గడిచిన రెండు నెలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 35 ఏళ్ల లోపు యువకులు 50 మందికి పైగానే మృత్యువాత పడ్డారు. ఇప్పుడు వస్తున్న బైక్‌ల సామర్థ్యానికి, మన రోడ్లకు పొంతన కుదరడం లేదు. ఏకంగా 610 సీసీ సామర్థ్యంతోనూ వస్తున్నాయి. అంటే సెకన్ల వ్యవధిలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇలాంటి బైక్‌లతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదం జరిగిన క్షణాల్లో మృత్యువాత పడు తున్నారు. తల్లిదండ్రులు స్టేటస్ పేరుతో అలాంటివే కొనిస్తున్నారు.. హెల్మెట్లు పెట్టుకోవడం లేదు. ఇద్దరికి మించి ప్రయాణిస్తున్నారు. వాహనంపై గర్ల్‌ఫ్రెండ్ ఉంటే మరీ రెచ్చిపోతున్నారు. ప్రమాదంలో ఇద్దరూ చనిపోయిన ఘటనలు ఉన్నాయి.

ఒకరి నిర్లక్ష్యం..మరొకరు బలి!

రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకుల ప్రాణాలు బలైపోతున్న ఘటనల్లో ఎదుటి వాహనాల వేగం, నిర్లక్ష్యమూ శాపంగా మారుతోంది. కాలేజీకి వెళుతున్న విద్యార్థుల బైక్‌లను కార్లు, లారీలు, బస్సులు ఢీకొట్టి వెళ్లిపోతున్న ఉదంతాలూ అధికంగానే ఉన్నాయి. జాతీయ రహదారులపైనా, రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డులోనూ జరిగిన ప్రమాదాల్లో పలువురు విద్యార్థులు మరణించారు.







ధవళేశ్వరం ప్రమాదంలో మృతులు

హెల్మెట్ మరువొద్దు మిత్రమా!

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ మరచిపోవొద్దు మిత్రమా అంటున్నారు.. ఈ స్నేహితులు.. ఎందుకో తెలుసా.. మీరే చదవండి.. ముమ్మిడివరం మండలం క్రరివానిరేవు పంచాయతీ పరిధి బూరుగపేటకు చెందిన మట్టా ఆకాశ్‌రెడ్డి ముమ్మిడివరానికి చెందిన దొమ్మేటి జయఅభినవ్ గత నెల 28వ తేదీన ఐ.పోలవరం మండలం పాత ఇంజరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తమ స్నేహితుడు ఆకాశ్‌రెడ్డి హెల్మెట్ లేకపోవడం వల్లే తమకు దూరమయ్యాడని.. హెల్మెట్ ఉంటే బతికి ఉండేవాడని.. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. చెప్పడమే కాదండోయ్.. సోమవారం ముమ్మిడివరంలో 20 మంది కలిసి రూ.25 వేల విలువగల వంద హెల్మెట్లను ముమ్మిడివరం స్టేట్‌బ్యాంకు వద్ద వాహనచోదకులకు ఉచితంగా అందజేశారు.



ఒక్క జనవరిలోనే పోయిన ప్రాణాలు

జనవరి 2 : తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్ (20) అన్నదమ్ముల బిడ్డలు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపి తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందారు.

జనవరి 3 : అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డు లో గురువారం అర్ధరాత్రి దాటాక కంటైనర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) మృతిచెందాడు.



మురారి ప్రమాదంలో మృతులు

జనవరి 3 : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ కళాశాల సమీపంలో హైవేపై లారీని ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో లారీకి హ్యాండిల్ తగిలి బైక్ జారిపడగా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20) లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

జనవరి 4 : కాకినాడ బీచ్‌రోడ్డులో ఓ కళాశాల బస్సు ఢీకొని వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ(22) మృతిచెందాడు.

జనవరి 5 : రంగంపేట మండలం వడిశలేరులో ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన ఆరవ మణికంఠ (23),తోకాడ చరణ్(22) మృతి చెందారు.

జనవరి 11 : కాకినాడ ఘాటీ సెంటర్ చేపల మార్కెట్ వద్దకు ద్విచక్రవాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన దేగల రేణుక (18) మృతిచెందింది.

జనవరి 19 : ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

జనవరి 20 : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు నక్క సాయికృష్ణ (23), అతడి మావయ్య కూడా మృతి చెందారు.

జనవరి 20 : కిర్లంపూడికి చెందిన ముక్కా నాగవీరభద్ర దుర్గ (20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర (21) సంక్రాంతి పండగకు వచ్చి బైక్‌పై హైదరాబాద్ తిరిగి వెళ్తున్నారు. కృష్ణా జిల్లా గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను వీరి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

జనవరి 26 : ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడగా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18), మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మృతిచెందారు.



గత నెల 28న ఐ.పోలవరం వద్ద మృతిచెందిన ఆకాశ్‌రెడ్డి, జయఅభినవ్



పిఠాపురంలో కాకినాడ ఎస్పీతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

జనసేన ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

» మంత్రి నాదెండ్ల మనోహర్ 7



విలేకరులతో మాట్లాడుతున్న వర్మ 7

చంద్రబాబు నిర్ణయాన్ని శిరసావహిస్తా

» పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



తుని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా రూపాదేవి 7

రూపాదేవికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కాకినాడలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



జస్టిస్ ఎన్వీ రమణకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం కాకినాడకు విచ్చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, జిల్లా నాల్గో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ నిరుపమ పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందించి సాదర స్వాగతం పలికారు. జస్టిస్ ఎన్వీ రమణ మంగళవారం ఉదయం 9గంటలకు అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శించుకుంటారు. అక్కడినుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

అర్జీలను పరిష్కరించాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి అందుతున్న అర్జీలకు అధిక ప్రాధాన్యమిచ్చి సానుకూల దృక్పథంతో సకాలంలో పరిష్కరించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం జరిగింది. మొత్తం 594 అర్జీలందాయి. డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్,కేఎస్ఈజెడ్ రామలక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 91 అర్జీలు

కాకినాడ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో పోలీస్‌స్టేషన్‌లకు వచ్చేవారికి న్యాయం చేయాలని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 91మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ వెంటనే సంబంధిత ఎస్‌డిపిఓలు, సీఐలతో మాట్లాడి సమస్య సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు.

డ్రోన్ల వినియోగంతో సత్ఫలితాలు

» కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడక్రైం,మార్చి 10(ఆంధ్రజ్యోతి): అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ల వినియోగం సత్ఫలితాలను ఇచ్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. జిల్లా పోలీస్‌శాఖలో వినియోగించేందుకు రూ.24లక్షలతో సమకూర్చిన 13 డ్రోన్లను జిల్లా పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ మేరకు విజిబుల్ పోలీసింగ్ విత్ ఇన్‌విజిబుల్ పోలీస్ అనే విధానంలో పోలీస్‌శాఖ డ్రోన్ల సహాయంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, నేరాల అదుపునకు చర్యలు చేపడుతూ సమాజంలో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ డ్రోన్లతో 24 గంటలు ఏరియల్ సర్వేలెన్స్, రియల్ టైం ట్రాఫిక్ మోనటరింగ్, క్రైం ప్రివెన్షన్ అండ్ ఇన్‌వెస్టిగేషన్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్, ఎన్‌హేన్స్‌డ్ సెక్యూరిటీ ఫర్ పబ్లిక్ ఈవెంట్స్, ప్రివెన్షన్ ఆఫ్ సోషల్ ఈవిల్స్, కోసం పగలు, రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించేందుకు ఉపయోగిస్తారని తెలిపారు. గత నెలలో జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో పనిచేసే 97మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరి రాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

బెల్ట్‌షాపులపై దాడులు

కాకినాడక్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ పరిధిలో గడిచిన మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో 15బెల్ట్‌షాపులను గుర్తించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జిల్లా అధికారిణి కృష్ణకుమారి సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడుల్లో 15మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేయడంతోపాటు కేసులు నమోదు చేసి వారి నుంచి 19.08 లీటర్ల మద్యాన్ని, 2.6 లీటర్ల బీర్‌ను సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

హోప్‌ఐలాండ్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి10(ఆంధ్రజ్యోతి): హోప్‌ఐలాండ్‌లో ఎకో టూరిజంని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త్ర, అటవీ, పర్యాటక, మెరైన్ పోలీస్‌శాఖల అధికారులతో కలిసి హోప్‌ఐలాండ్‌లో సోమవారం పర్యటించారు. కాకినాడ సముద్రతీరంలోఉన్న రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళంకార్యాలయంనుంచి హోప్‌ఐలాండ్‌కు చేరుకుని అక్కడిప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎకో టూరిజంని అభివృద్ధికి అనువుగా ఉన్న పరిస్థితులు, హోప్ ఐలాండ్ పరిధి, మడ అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, సందర్శకులకు బోటింగ్ సౌకర్యం ఇతర అంశాలపై ఆయాశాఖల అధికారులతో చర్చించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్‌బాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి వరప్రసాద్, సెక్షన్ అధికారి నాగార్జున, అసిస్టెంట్ టూరిజం అధికారి త్రిమూర్తులు పాల్గొన్నారు.



హోప్‌ఐలాండ్‌కి వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం: జిల్లా ప్రజా రవాణాధికారి

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్‌టికెట్ ఆధారంగా బస్సు పాస్ లేకపోయినా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఈనెల 17 నుంచి 31 వరకు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. పరీక్ష జరిగే సమయంలోనే ఉచిత ప్రయాణం చేయాలన్నారు.



వకుళమాత అన్నదాన భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మాస్టర్ ప్లాన్ ప్రకారం వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధి

భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తాం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


ఆత్రేయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలో ప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాము' అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయంలో వివిధ పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించి క్షేత్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులు, గ్రామ స్తులతో చర్చించారు. 'భక్తుల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. వసతి, దర్శన, సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రతి భక్తుడికీ సాధ్యమైనంత త్వరగా దర్శనం అందించే చర్యలు చేపట్టాలి. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాం' అని చెప్పారు. రూ.3.80కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్డు వద్ద ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్ల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి సూచనలు చేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కోనేరు నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని, డార్మెటరీలు, క్యూలైన్ల పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల సహకారం కోరుతున్నామని, పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి భక్తుల ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ సీహెచ్ విద్యాసాగర్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎస్ఐ ఎస్.రాము, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్లపూడి భాస్కర రావు, కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

వేసవి నేస్తం

వచ్చేసిందోచ్



అంబాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎరుపు రంగుతో నోరూరించే పుచ్చకాయ అంటే అందరికీ ఇష్టమే. మండుటెండలో ముక్క తింటే ఆ హాయి చెప్పలేనిది. ఎండలు ముదిరి శరీరంలోని ఖనిజ లవణాలు బయటకుపోతున్న తరుణంలో ఈ పుచ్చకాయలను రుచిచూస్తే ఆ మజానే వేరు. ఈ తీయని ఫలాలు ఇప్పుడు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దాహార్తి తగ్గించేందుకు ఇది బాగా పనిచేస్తుంది. రక్తపోటు ఉన్న వారు పుచ్చకాయ తింటే ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు చెప్తున్నారు. కాగా సీజను ఆరంభంలోనే హోల్‌సేల్ ధరలు హడలెత్తిస్తున్నాయి. రిటైల్‌గా మరింత ఎక్కువగా అమ్ముతున్నారు.

మార్కెట్‌లోకి పుచ్చకాయులు
సీజను ప్రారంభంలోనే అధిక ధరలు
రాష్ట్రంలో పంట లేకపోవడంతో
ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి



100 గ్రాముల పుచ్చకాయ గుజ్జులో ఉండే పోషకాలు...

నీరు: 95.2 గ్రాములు
ప్రొటీన్: 0.3గ్రాములు
కొవ్వు పదార్థాలు: .0.2 గ్రాములు
పీచు పదార్థాలు: 0.4 గ్రాములు
కెరోటిన్: 169 మైక్రో గ్రాములు
సి విటమిన్: 26 మిల్లీ గ్రాములు
కాల్షియం: 32 మిల్లీ గ్రాములు
పాస్పరస్: 14 మిల్లీ గ్రాములు
ఇనుము: 1.4 మిల్లీ గ్రాములు
సోడియం: 104.6 మిల్లీ గ్రాములు
పొటాషియం: 341 మిల్లీ గ్రాములు
శక్తి: 17 కిలో కేలరీలు



పుచ్చకాయలో విటమిన్-బి, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. 92 శాతం అల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండడంతో దీనిని తినడం వల్ల శరీరానికి నూతన శక్తి వస్తుంది. మలబద్ధకం నివారణకు ఇది మంచి చిట్కా అని వైద్యులు చెప్తున్నారు. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ నివారణకు దోహదపడుతుంది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి కూడా ఉపయోగం. ఆస్మా, మధుమేహం, అర్థరైటిస్ సమస్యల నుంచి చక్కని ఉపశమనం. రక్తప్రసరణ పెరుగుతుంది. గుండె కండరంలోని కణాలను కాపాడడంలో పుచ్చకాయలోని లైకోపీన్ అనే పదార్థం బాగా ఉపయోగపడుతుంది. ముఖవర్చసు పెంచి సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న వారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే నీరసం తగ్గి శక్తి వస్తుంది. పుచ్చకాయలో ఉన్నన్ని నీళ్లు మరే పండులో కానీ, కాయలో కానీ ఉండవు. గ్లాసు పుచ్చకాయ రసంలో స్పూన్ తేనె కలిపి రోజూ తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు తగ్గిపోతాయని వైద్యులు చెప్తున్నారు. లోపల ఎర్రటి గుజ్జుతో చూడగానే నోరూరించే పుచ్చకాయ గుజ్జులో గ్లుటాథియాన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు, జబ్బులు రాకుండా కాపాడుతుంది.



ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో పుచ్చకాయల విక్రయాలు జరిగేవి. నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి విక్రయాలు పెరిగాయి. పుచ్చకాయను కోసి ప్లాస్టిక్ గ్లాసుల్లో ఆకర్షణీయంగా పెడుతుండడంతో కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పుచ్చకాయ జ్యూస్ ఎక్కువగా తాగుతున్నారు. గిరాకీ దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు.

30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను



పుచ్చకాయల వ్యాపారాన్ని గత ముప్పై ఏళ్లుగా చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి సైకిల్ వ్యాపారులు, చిరు వ్యాపారులకు విక్రయించేవాడిని. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు మన రాష్ట్రంలో పుచ్చకాయ పంటను సాగు చేయట్లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

- దంగేటి నారాయణరావు,
పుచ్చకాయల వ్యాపారి, బండారులంక,

పుచ్చకాయలతో ఆరోగ్యం



వేసవిలో పుచ్చకాయలను తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. దీంట్లో చాలా ఔషధ గుణాలు ఉన్నాయి. నీరసం కలిగిన వ్యక్తులు పుచ్చకాయలను తింటే కొంత ఉపశమనం పొందవచ్చు. దీనిని తినడం వల్ల నీటి శాతం పెరుగుతుంది. దాహం తగ్గుతుంది.

డాక్టర్ కేఎన్ శ్రీనివాసరావు,
వైద్యాధికారి, అంబాజీపేట

నమో నారసింహాయ

- **వైభవంగా బ్రహ్మోత్సవాలు**
- **గోవిందనామంతో పులకించిన కోరుకొండ**
- **వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

కోరుకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపైన, దిగువున స్వామి వారు ప్రత్యేక ఆభరణాలు, అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5గంటల నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కొండ ఎక్కలేని భక్తులకు స్వామి వారి పాదాల వద్ద పానకం పోసి, కొబ్బరి కాయలు కొట్టారు. మరికొందరు కొండపైకి వెళ్లి స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగువ దేవస్థానం ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆవునెయ్యి, ఒత్తితో పొన్నచెట్టు దీపాలు వెలిగించారు. పెద్దపెద్ద మట్టి మూకుడులో మంచి నూనె వేసి దీపాలు వెలిగించారు. అంతకుముందు దేవుని కోనేటి వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగించారు. మహిళలు కొండ పాదవునా 615 మెట్లకు పసుపు రాసి బొట్లు పెట్టుకుంటూ పైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఉదయం, సాయంత్రం స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. 5 రోజుల పాటు భక్తులందరికీ అన్నదానం చేస్తామని సత్రం ఈవో తెలిపారు.

వైభవంగా నరసన్న రథోత్సవం

నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రథోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, వ్యవస్థాపక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, ఇతర అధికారులు, నాయకులు ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారిని, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి మధ్యాహ్నం 1.56 గంటలకు రథోత్సవం ప్రారంభించారు. పండితులు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవిందా గోవిందా అంటూ భక్తజనం రథాన్ని లాగారు. రథానికి ముందు పండితుల వేద గోష, భజనలు, గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాలు ఆకట్టుకున్నాయి. 250 మంది స్వామి మాలధారులు జెండాలతో రథం ముందు నడిచారు. రథం సాయంత్రం 6గంటలకు స్వామి దిగువ దేవస్థానానికి చేరింది. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు స్వచ్ఛందంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం, స్వామి వారు



శ్రీ లక్ష్మీనరసింహ స్వామి





స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల, పల్లకీ మోస్తున్న దృశ్యం

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, కటకం చలం, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, సర్పంచ్ కర్రి లక్ష్మీనరోజ, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

లక్ష్మీనరసింహస్వామి, శ్రీభూ సమేత అనంత పద్మనాభ స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి 11గంటలకు వైభవంగా జరిగింది. ఒకే రోజు ఒకే శుభముహూర్తంలో ఇటు నరసింహస్వామిది, అనంత పద్మనాభుడి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. రథోత్సవం అనంతరం సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లను రథం పైనుంచి ఎదుర్కోలుతో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయానికి తోడ్కొని వచ్చారు. అక్కడ మంగళస్నానాలు జరిపించారు. కల్యాణోత్సవాల్లో పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి చంటిబాబు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వీరితో పాటు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, మరో 300 మంది యజమాన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ, అంతర్వేది నరసింహస్వామి దేవస్థానం, పలువురు భక్తులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోరుకొండలో నేటి కార్యక్రమాలు

నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం కొండ పైన, దిగువున స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. ఉదయం 9గంటలకు సేవాకాలం, రాత్రి 8గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. రాత్రి 7నుంచి 9గంటల వరకు స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన, శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు జరుగనున్నాయి.



కోనేటిలో స్నానమాచరిస్తున్న భక్తులు



రథోత్సవంలో శక్తివేషధారణలు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి



వేంకటేశ్వరస్వామి వేషధారణ

తలుపులమ్మకు కాసుల హారం

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం లోవ స్థానంలో తలుపులమ్మ అమ్మవారికి కాకినాడకు చెందిన కోకా వెంకట కోటేశ్వర పణి-మైథిలి దంపతులు 102గ్రాములతో బంగారు కాసుల హారం చేయించారు. సోమవారం హారాన్ని ఈవో పి.విశ్వనాథరాజుకు అందజేశారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనమిచ్చి తీర్థ ప్రసాదాలందజేశారు.

తొడుగు మేలే

- **మామిడి కాయలకు తొడుగులతో మంచి దిగుబడులు**
- **50 శాతం రాయితీపై కవర్ల పంపిణీ**
- **డీబీటీ పథకంలో రైతులకు వర్తింపు**
- **ఉద్యాన శాఖ అధికారిణి దివ్యశ్రీ**







మామిడి చెట్టున ఉన్న కాయలకు తొడిగిన కవర్లు

రాజానగరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో మామిడి కాయలకు తొడుగులు అమర్చడంతో మేలైన పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ రైతులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పండ్ల తోటల రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై కవర్లు/తొడుగులను మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్(డీబీటీ) పథకంలో భాగంగా అందజేస్తోందన్నారు. కవరు ఒకటి రూ.2 వంతున కొనుగోలు చేస్తే దీనిలో రూ.1 రాయితీ రైతు ఖాతాలో జమవుతుందన్నారు. హెక్టారుకు 10 వేలు కవర్లపై రాయితీ వర్తిస్తుందన్నారు.

సమర్పించాల్సిన పత్రాలు...

ఆసక్తి కలిగిన రైతులు కవర్లు కొనుగోలు చేసిన బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకాలు జిరాక్స్ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోను సంబంధిత రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో అందజేయాల్సి ఉంటుందన్నారు.



చీడపీడల నియంత్రణ..

పండ్ల తోటల రైతులు మామిడి కాయలకు కవర్లు వినియోగించడం వల్ల మసి, మంగు, మచ్చలు, తేనె మంచు పురుగు, కాయపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలైన వాటిని నియంత్రించడంతో పాటు నాణ్యమైన మామిడి పండ్ల దిగుబడులు పొందవచ్చని దివ్యశ్రీ అంటున్నారు.

ఎప్పుడు, ఎలా వాడాలి..

మామిడి పిందె దశలో అనగా నిమ్మకాయ, కోడి గుడ్డు పరిమాణం దశకు చేరుకున్న తర్వాత కవర్లు వాడాలి. మంచి పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీమీటర్ల పైన తొడిమకు సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలన్నారు. 50 రోజుల తర్వాత కాయలు కోత దశకు చేరుకుంటాయన్నారు.

ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి..

మామిడి తొడుగులు/కవర్లు చెక్క గుజ్జుతో తయారైన పేపరును మామిడి కాయకు తొడగడం వల్ల మంచి లక్షణాలు చేకూరి, చెడు లక్షణాలు తొలగిపోతాయి. అంతే కాకుండా క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుంది. అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన నుంచి కాపాడుతుంది. పరిమాణాన్ని, సహజ రంగును వృద్ధి చేస్తుంది. అలాగే తక్కువ కాలంలోనే పెరుగుదల సామర్థ్యాన్ని పెంచి, అధిక దిగుబడులనిస్తుంది. అంతేకాకుండా మామిడి పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పండ్ల తోటల రైతులు, వ్యాపారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివ్యశ్రీ కోరారు.

హోంగార్డుపై ఎస్‌ఐ ప్రతాపం

» దొంగతనం అంటగట్టాలని ప్రయత్నం
» నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి
» తీరా అతడు కాదని తేలడంతో వదిలివేసిన వైనం
» ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం?


ఎస్‌ఐ యూనిఫాంలో దోపిడీకి పాల్పడిన అసలు నిందితుడు

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లారీని ఎస్‌ఐ వేషంలో బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే అనుమానంతో ఒక హోంగార్డును విచారణ పేరుతో ఒక ఎస్‌ఐ చితకబాదిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 2న తెల్లవారుజామున రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు బ్రిడ్జిపై చిత్తూరు వెళుతున్న ఓ లారీని పోలీసు అంటూ ఓ వ్యక్తి ఎస్‌ఐ దుస్తుల్లో అటకాయించాడు. డ్రైవరును బెదిరించి బైక్‌పై ఎక్కించుకుని పేపరుమిల్లు సమీపంలోని ఓ ఏటీఎంకి తీసుకెళ్లాడు. డ్రైవరుతో రూ.10వేలు డ్రా చేయించి తీసుకుని అతడిని లారీ వద్ద దింపేశాడు. ఈ విషయం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ వరకూ వెళ్లడంతో త్రీటౌన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు వేగం చేశారు. సీసీ ఫుటేజీ లను పరిశీలించారు. ఓ హోం గార్డు మాదిరిగా ఆ ఫుటేజీలోని వ్యక్తి కనబడడంతో ఆ హోంగార్డును ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడికి తీసుకువెళ్తున్నారో ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా చెప్పలేదు. ఆ హోంగార్డు సుమారు 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అతడిని పోలీసుల వార్‌రూమ్‌కు అంటే నిందితులను చితక్కొట్టే ప్రదేశానికి తీసుకెళ్లారు. ఓ ఎస్‌ఐ వచ్చి సదరు హోంగార్డును నానా బూతులు తిట్టారు. భౌతిక దాడికీ దిగాడు. నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి చేశాడు. ఈలోపు ఆరుగురు పోలీసులు జీపులో ఆ హోంగార్డు ఇంటికెళ్లి ఏ ఉత్తర్వులూ చూపకుండా సోదాలు చేశారు. హోంగార్డు తల్లి, చిన్న పిల్లాడిని బెంబేలెత్తించారు. అయితే అసలు దొంగ దొరికాడని సమాచారం రావడంతో రాత్రి 9 గంటల సమయంలో ఆ హోంగార్డుకు సర్ది చెప్పి పంపేశారు. ఆ హోంగార్డుతో ఒట్టు వేయించుకున్నారు. చిరుద్యోగి కావడంతో అధికారులను ప్రశ్నించలేక రోదిస్తూ ఇంటికెళ్లిపోయాడు. అనంతరం హోంగార్డు కార్యాలయానికి అతడిని అటాచ్ చేశారు.

జైల్లో పరిచయం.. ఒంటరి మహిళలే లక్ష్యం!


వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్

● వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు దొంగలు
● 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం

కాకినాడ రూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీల్లో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాకినాడ ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఈ వివరాలను వెల్లడించారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడే వారిని పట్టుకునే చర్యల్లో భాగంగా సోమవారం ఉదయం కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. ఇంద్రపాలెం ముసలమ్మతల్లి గుడికి సమీపంలో ఎస్‌ఐ ఎం. వీరబాబు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వస్తున్న కాకినాడ రూరల్ మండలం తూరంగికి చెందిన గంపల సతీష్ (25), కిర్లంపూడి మండలం బూరగుపూడికి చెందిన పట్టెం వరప్రసాద్(26)ను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు పాత నేరస్థులేనని, ఒంటరి మహిళలే వారి లక్ష్యమని తెలిసిందని ఎస్డీపీవో చెప్పారు. నిందితులు జైల్లో ఒకరికొకరు పరిచయమై మిత్రులై కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. వారి నుంచి సుమారు రూ.6,50,000 విలువచేసే 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో 2, కరప పీఎస్‌లో 1, కాకినాడ 1వ పట్టణ పీఎస్ పరిధిలోని 1కేసులో మొత్తం 78 గ్రాముల చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కాకినాడ సీసీఎస్ సీఐ కృష్ణ, ఏఎస్‌ఐలు గోవిందు, పుల్లయ్య పాల్గొనగా దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్డీపీవో అభినందించారు.

చంద్రబాబు నిర్ణయాన్ని శిరసావహిస్తా

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, భవిష్యత్తు రథసారధి నారా లోకేశ్ నిర్ణయాలు, ఆదేశాలను శిరసావహిస్తానని, వాటిని తాను, తన కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కుటుంబం ఎల్లప్పుడు పాటిస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు తొలివిడతలోనే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆయనకు ఇస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భావించారు. అయితే ఆదివారం రాత్రి ప్రకటించిన జాబితాలో వర్మకు ఎమ్మెల్సీ రాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తమ నాయకుడిని ఈ సారి అన్యాయమే జరిగిందని ఆవేదన చెందారు. దీంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి సోమవారం భారీగా తరలివచ్చారు. వారితో వర్మ మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. చంద్రబాబుతో మన ప్రయాణం 23 ఏళ్లు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో ప్రజాసమస్యలపై పోరాటం సాగించామని, అధికారంలోని ఉన్నా, ప్రతిపక్షంలో అయినా వారికి, పార్టీకి అండగా ఉన్నామని తెలిపారు. ప్రజాసేవ చేసే అవకాశమే తనకు పెద్ద పదవి అని అన్నారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఎల్లప్పుడు చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉంటుందని ప్రకటించారు. వారి అడుగుజాడల్లోనే తామంతా నడుస్తామని తెలిపారు. పార్టీలో మనకు ఎంతో భవిష్యత్తు ఉందని, అందరూ కుటుంబంలా కలిసికట్టుగా ఉంటూ పార్టీకి అండగా ఉందామని వర్మ ప్రకటించారు.

ఆలోచింపజేసిన ఇది అతని సంతకం


ఇది అతని సంతకం నాటకంలోని ఓ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి జీవితంలో ఒక లక్ష్యం, నిర్దిష్టమయిన ప్రణాళిక, బలమైన నిర్ణయం ఉంటుంది. దానిని ఆచరణలో పెట్టి సాధించుకోగలిన వారి జీవితం పరిపూర్ణమవుతుంది అని ఇది అతని సంతకం నాటకం ద్వారా చాటి చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో మూడోరోజు సోమవారం గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది అతని సంతకం నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ) రచించగా ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

రేపు రైల్వే జీఎం రాక

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం పర్యటించనున్నారు. ఆయన భద్రతా పరమైన అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తారని తెలుస్తోంది. ఉదయం 10 గంటలకు కాకినాడలో బయలుదేరి ట్రాక్, పాయింట్లు తదితర అంశాలను పరిశీలించుకుంటూ రాజమహేంద్రవరం గుండా విజయవాడ వెళ్తారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆగినా ట్రాక్, సిగ్నల్స్ సంబంధిత భద్రతా అంశాలనే పరిశీలిస్తారని చెబుతున్నారు. వాస్తవానికి గత నెల 9 నుంచి ఆయన పర్యటన వాయిదా పడుతూ వస్తోంది. ఇక్కడ పనులు పూర్తికాకపోవడంతో ఆలస్యమైంది. గతంలో జీఎం తనిఖీలు ఉంటే క్వార్టర్లతో సహా అన్నిటినీ ముస్తాబు చేయడం రివాజుగా ఉండేది. కానీ ఇప్పుడు నిధుల కొరత వల్ల భద్రతా పనులకే పరిమి తమయ్యారు.

'పది' మూల్యాంకన విధులపై సమావేశం

కాకినాడ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షాపత్రాల మూల్యాంకనం విధులపై సోమవారం కాకినాడలోని రామకృష్ణ ఆడిటోరియంహాల్లో పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ జి.నాగమణి ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలకుల సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాల డీఈవోలు రమేష్, నారాయణ, ఏసీఈలు, సీసీవోలు, ఏసీవోలు పాల్గొన్నారు.

ఓపీకపట్టి..





కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి సోమవారం రోగులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే బారులుతీరారు. 'ఓపీ' కోసం క్యూలలో గంటల తరబడి వేచి ఉన్నారు. నిరీక్షించి, నీరసించారు.

ఫొటోగ్రాఫర్ –కాకినాడ

కొడుకుని చూసేందుకు వెళ్తూ.. తండ్రి మృత్యువాత


అప్పారావు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

రాజుపాలెం రహదారిపై మృతదేహంతో బంధువుల ఆందోళన

కిర్లంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు(29) ఆదివారం రాత్రి చిల్లంగి నుంచి వీరవరం అత్తవారింటికి వెళ్తుండగా రాజుపాలెం గ్రామం వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అప్పారావు ప్రమాదవశాత్తు ఆ లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో అప్పారావు తలకు బలయమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బంధువులు సోమవారం ఉదయం రాజుపాలెం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిపై మృతదేహంతో నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే కిర్లంపూడి పోలీసులు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామని నచ్చజెప్పారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

4 నెలల క్రితమే కొడుకు పుట్టడంతో..

అయితే అప్పారావు తాపీపని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, కూతురు, ఉన్నారు. కాగా 4 నెలల క్రితమే కొడుకు పుట్టాడు. కుమారుడిని చూసేందుకు ఆదివారం రాత్రి వెళ్తుండగా అప్పారావును మృత్యువు లారీ రూపంలో కబలించేసింది. ఈ దుర్ఘటనతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో అటు చిల్లంగి, ఇటు వీరవరం గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. పిల్లలిద్దరూ అనాధలైపోయారని అప్పారావు భార్య, బంధువులు రోధనలు మిన్నంటాయి. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని మృతుడు అప్పారావు బంధువులు కోరుతున్నారు.

పరీక్ష రాసేందుకు వెళ్తూ... ఇంటర్ విద్యార్థి దుర్మరణం


సంఘటనా స్థలంలో వంశీ మృతదేహం


ఫైల్‌ఫొటో

సామర్లకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అభ్యసించాలని ఎన్నో కలలు కన్న విద్యార్థిపైకి మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించిన సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో సోమవారం జరిగింది. సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెనికి చెందిన ప్రగాఢ వంశీ (19) ఇంటి నుంచి కాకినాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు మిత్రులతో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యన రోడ్డుపై ఇసుక గుట్ట కారణంగా మోటార్‌సైకిల్ రోడ్డుపైకి స్కిడ్ అయ్యి వెనుక కూర్చున ప్రగాఢ వంశీ (19) రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ వంశీ తలపై నుంచి వెళ్లిపోవడంతో మరణించాడు. కేవలం పది నిమిషాల ముందే పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి వెళ్లిన తమ కుమారుడు ప్రమాదంలో మృతిచెందాడన్న సమాచారంతో వంశీ తండ్రి రాజు, తల్లి రోధించారు. సంఘటనా స్థలికి సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సిబ్బందితో చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు నిర్వహించారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామం వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన విజయకుమారి

రావులపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఉబలంక వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి (40) భర్త రమేష్‌బాబుతో కలిసి మోటార్‌సైకిల్‌పై పని నిమిత్తం రావులపాలెం వచ్చారు. తిరిగి స్వగ్రా మం వెళ్తుండగా మార్గమధ్యలో ఉబలంక సమీపంలోకి వచ్చేసరికి టిప్పర్ లారీ బలంగా ఢీకొంది. విజయకుమారి లారీ కింద పడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందగా భర్త రమేష్‌బాబు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

● వేదికపై యువత, రైతు, మహిళ ప్రతినిధులకు మాట్లాడే అవకాశం
● మంత్రి నాదెండ్ల మనోహర్


కాకినాడలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో మార్చి 14న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభ దాదాపు 5గంటలపాటు సాగుతుందన్నారు. మన భాష, యాస, సంస్కృతిని ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశామన్నారు. సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నా దృష్ట్యా వారికి ఎలాంటి ఇక్కట్లు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో భోజనానికి ఇబ్బంది కలగకుండా ముఖ్యమైన 4 రహదారుల్లో భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభలో యువతకు మాట్లాడే అవకాశం కల్పించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించారన్నారు. రైతు, మహిళ ప్రతినిధులు మాట్లాడతారన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై పవన్ మాట్లాడతారని పేర్కొన్నారు.

పారిశుధ్యం కోసం ప్రత్యేక కమిటీ

సభ పూర్తయిన అనంతరం పరిసరాలను శుభ్రం చేయడానికి ప్రత్యేక కమిటీ నియమించాలని పవన్ స్పష్టం చేశారన్నారు. ఈ మేరకు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో 25 మంది స్థానిక నాయకులతో కమిటీని నియమించామని, ఈ కమిటీ సభ ముగిసిన అనంతరం సభా ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జెండాలు, ఫ్లెక్సీలు, ఇతర పార్టీల జెండాలు కిందపడినా వాటిని జాగ్రత్తగా తొలగిస్తారని తెలిపారు. సభకు తరలివచ్చే కార్యకర్తల కోసం మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్‌ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. వీటితోపాటు పుచ్చకాయ ముక్కలు ఉచితంగా అందించేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. ఇందుకు కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల తోపుడు బండ్లవారితో మాట్లాడుతున్నాం.


75 సీసీ కెమెరాలతో నిఘా

ఉపముఖ్యమంత్రి పవన్ సభకు హాజరవుతున్నందున ఆయన భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోలీస్ డిపార్టుమెంట్ తీసుకుంటుందన్నారు. ఇందుకోసం 75 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు తరలివచ్చే లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల14న జరగనున్న 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, సభ ఏర్పాట్లును ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు.

తుని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా రూపాదేవి


బాధ్యతలు స్వీకరిస్తున్న రూపాదేవి

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలో తీవ్ర గందరగోళానికి తెరపడింది. 17 మంది వైసీపీ కౌన్సిలర్లు వరుసగా టీడీపీలోకి చేరిపోవడంతో వైసీపీ సంఖ్యా బలం సన్నగిల్లింది. దీంతో చేసేదేమీ లేక ఆ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి రాజీనామా సమర్పించారు. దీంతో టీడీపీలోకి చేరిన 17 మంది కౌన్సిలర్లతో తొలి కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేరిన 28వ వార్డు కౌన్సిలర్ కుచ్చర్ల పాటి రూపాదేవి ఇన్‌చార్జి వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో వైసీపీ తుని మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. బాధ్యతలు చేపట్టిన రూపాదేవికి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, సుర్లపరాజు, యినుగంటి సత్యనారాయణ, నాయకులు, కౌన్సిల్ సభ్యులు శుభాకాంక్షలు తెలపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


సత్యనారాయణ (ఫైల్)

పిఠాపురం రూరల్, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): పంటపొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురయి రైతు మరణించాడు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన రైతు చిన్నారి సత్యనారాయణ(65) సోమవారం పశువుల మేత కోసం గడ్డి కోసేందుకు పొలంలోకి వెళ్లాడు. గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. పంటపొలాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు ఎలక్ట్రికల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, వీటి వల్లే సత్యనారాయణ మరణించాడని అతని కుటుంబసభ్యులు, రైతులు చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలోని పీచు ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అమలాపురం అగ్నిమాపక అధికారి కె.మురళీకొండబాబు తెలిపారు. సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపుచేశారు. దొమ్మేటి విష్ణువీర వసంతరాయులు, భైరిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన ఫ్యాక్టరీలోని పీచు రూ.3లక్షలమేర నష్టం వాటిల్లినట్టు చెప్పారు.

రాజవొమ్మంగిలో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

రాజవొమ్మంగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిలో ఆగిఉన్న కారులో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన గంటిమెల్ల సన్యాసిరావుకు చెందిన కారులో ఇద్దరు వ్యక్తులు లాగరాయి నుంచి రాజవొమ్మంగి సాయికిరణ్ కాన్వెంట్‌కు పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. ఈ తరుణంలో కారు ఇంజన్ నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు, బంక్ సిబ్బంది అదుపు చేశారు. రేడియేటర్‌లో వాటర్ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మెకానికర్లు తెలిపారు. కారు రన్నింగ్‌లో మంటలు వ్యాపిస్తే పెనుప్రమాదం జరిగి ఉండేదని భావించారు.

ఆన్‌లైన్ షేర్ల పేరిట రూ.60 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): ఆన్‌లైన్ షేర్లలో అధిక లాభాలు వస్తాయని ఓ విశ్రాంత ఉద్యోగి లక్షల్లో సొమ్ము కోల్పోయారు. ప్రకాశం నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటేశ్వరనగర్‌కు చెందిన నున్న వెంకటేశ్వరరావు పేపర్ మిల్లులో జీఎం స్థాయిలో ఉద్యోగం చేస్తూ రెండేళ్ల క్రితం విరమణ పొందారు. విరమణ డబ్బులను షేర్ మార్కెట్‌లో పెట్టడం ద్వారా ఇంకా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో షేర్ మార్కెట్ గురించి వెతికారు. ఈ క్రమంలో ఓ కంపెనీ ఎక్కువ మొత్తంలో లాభాలు చూపడంతో ఆ కంపెనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రక్రియ పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి దఫదఫాలుగా పెట్టుబడి పెట్టగా డబ్బులు బాగానే వచ్చాయి. దీంతో ఈ జనవరి నుంచి రూ.60లక్షలు పెట్టుబడి పెట్టారు. యాప్‌లో రూ.1కోటికిపైగా లాభాలు చూపిస్తున్నాయి. అయితే ఆ డబ్బులు తన ఖాతాలో జమ కావడం లేదు. దీంతో ఆ యాప్ గురించి ఆయన ఇంటర్నెట్‌లో వెతకగా కనబడలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు మంత్రి సాయం


మహిళను మంత్రి వాహనం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

ఆలమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు సాయం చేసి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన సూరిశెట్టి రేవతి, రామకృష్ణ దంపతులు బైక్‌పై వెళ్తుండగా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద ప్రమాదం జరిగి రేవతి తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో అసెంబ్లీ సమావేశాలకు రామచంద్రపురం నుంచి అమరావతి వెళ్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆగారు. మహిళను తక్షణం తన వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసాయం అందించారు. అక్కడ ఉన్న వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యసాయం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అమరావతికి తరలివెళ్లారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

100మందికి ఉద్యోగ అవకాశాలు

కాకినాడ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ద్వారా 100 మంది అభ్యర్థులకు చెన్నైలోని తమ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించామని ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీ డిప్యూటీ జీఎం ప్రవీణ్‌బాబు వెల్లడించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందజేశారు.వికాస పీడీ లచ్చారావు పాల్గొన్నారు.

నౌకాదళం ఎంపికతో ఉజ్వల భవిష్యత్తు


వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్‌తో నేవీ అధికారులు

జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళాన్ని కెరీర్‌గా ఎంచుకోవడం ద్వారా దేశానికి సేవ చేయడంతోపాటు జీవితంలో ఉజ్వల భవిష్యత్తుకు చేరుకోవచ్చని జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. నౌకాదళంలోని ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగించేందుకు కోల్‌కత్తాలోని తూర్పు నౌకాదళ కమాండ్ కోల్‌కత్తా నుంచి కన్యాకుమారి మీదుగా చెన్నై వరకూ చేపట్టిన మోటార్‌కార్ ర్యాలీ సోమవారం జేఎన్టీయూకే యూనివర్సిటీకి చేరుకుంది. అలూమ్ని ఆడిటోరియంలో వర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇండియన్ నేవీలో ఉపాధి అవకాశాలు కెరీర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తూర్పు నౌకాదళ కమోడోర్ అమర్జీత్ సాలుజా మాట్లాడుతూ మోటార్‌కార్ ర్యాలీ ఈనెల 21న చెన్నైకు చేరుకుంటుందన్నారు. ఈ ర్యాలీలో భాగంగా సముద్రతీరంపై అవగాహన పెంపొందించడంతోపాటు యువతకు భారత నౌకాదళంలోని ఉపాధి అవకాశాలను తెలియజేస్తామన్నారు. విద్యార్థుల ప్రశ్నలను నేవీ అధికారులు నివృత్తి చేశారు. లెఫ్టినెంట్ కమాండర్లు అవినాష్‌ఖాత్రి, అనిరుద్‌రాణా, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కనుల పండువగా వెంకన్న కల్యాణం


పిఠాపురంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం ధ్వజారోహణం, స్నపన తిరుమంజనం, చతుఃస్థానార్చన నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి టీటీడీ వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య కల్యాణాన్ని(శ్రీనివాస కల్యాణోత్సవం) జరిపించారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొండెవరంలో శ్రీపద్మావతిసమేత వేంకటేశ్వరస్వామి 62కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలతో స్వామి కల్యాణం నిర్వహించారు. 5 రోజులపాటు మహోత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాంఘిక నాటికల పోటీలను నిర్వహించబోతున్నారు.

'ఆమనగంటి' సేవలు చిరస్మరణీయం

కాకినాడ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కులకోసం జీవితకాలం పోరాడిన 'ఆమనగంటి' సేవలు చిరస్మరణీయమని ఏపీ ఎన్జీజీవో సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు అన్నారు. ఏపీఎన్జీజీవో సంఘం వ్యవస్థాపకుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపకుడు ఆమనగంటి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎన్జీవోహోంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారి పద్మమీనాక్షి, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ బి.సుజాత, కోఛైర్‌పర్సన్ భారతి పాల్గొన్నారు.

10న దళితులతో భారీ ఐక్యతా ర్యాలీ

కాకినాడ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 10న కాకినాడలో దళితులతో భారీ ఐక్యతా ర్యాలీ నిర్వహిస్తామని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు అన్నారు. ఎస్.అచ్యుతాపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దళితులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయకులు దారయేసురత్నం, పలివెల రవి, కౌజు నెహ్రూ, బచ్చల కామేష్ తదితరులున్నారు.

అర్జీ ఆరాటం.. పరిష్కార పోరాటం!

కాకినాడ కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ఈ సోమవారం పెద్దఎత్తున అర్జీదారులు పోటెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు, నాలుగు వారాలుగా పీజీఆర్ఎస్ నిర్వహించకపోవడం.. ఈ సోమవారం అర్జీలు స్వీకరిస్తుండడంతో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి అర్జీదారులు తరలివచ్చారు. తమ సమస్యల అర్జీలను జిల్లా అధికారులకు అందజేశారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్దకు చేరుకున్నారు.

ఆ సొమ్ములు వెనక్కి ఇప్పించండి



మాది సామర్లకోట. నా భార్య అడపాక జయలక్ష్మికి వైసీపీ ప్రభుత్వ హయాంలో అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలం మంజూరైంది. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం ప్రభుత్వం చేపట్టాలనుకుంటే రూ.2లక్షలు చెల్లించాలని వలంటీర్ జయలక్ష్మికి సూచించింది. తొలి విడతగా రూ.50 వేలు చెల్లించమని చెప్పడంతో అప్పు చేసి మరీ ఆ మొత్తాన్ని హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పెద్దాపురం పేరున చెల్లించాం. మూడేళ్లయ్యింది. ఇప్పటివరకు ఆ మొత్తం ఏమైంది? ఆ ఇంటి నిర్మాణం ఏమైందో తెలియడం లేదు. మేం చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని కోరుతున్నాం.

-అడపాక సత్యనారాయణ, సామర్లకోట

మా భూమి ఇప్పించండి



మాది పెద్దాపురం మండలం కట్టమూరు. సామర్లకోట మండలం అచ్చంపేట సమీపంలోని బ్రహ్మానంద పురంవద్ద 29 సెంట్ల భూమిని నా భార్యకు ఆమె తండ్రి రాసిచ్చారు. వైసీపీ హయాంలో 2020, మే 10న ఆ భూమిని 'అందరికీ ఇళ్లు' పేరుతో పేదలకు ఇళ్ల స్థలాల కోసం తీసుకున్నారు. ఇప్పటికీ ఆ భూమికి సంబంధించిన సొమ్ములు చేతికి అందలేదు. దీనిపై జిల్లాస్థాయి ప్రజాదర్బార్‌కు 30సార్లు, ఆర్డీవో ఆఫీసుకు 30సార్లు తిరిగినా పరిష్కారం లభించడం లేదు.

-మల్లెల ముత్యాలరావు, పెద్దాపురం

బంగారం వస్తువుల మాయం..

నా పేరు లక్ష్మీదీప్తి.. మాది వైజాగ్. నా భర్త ఆర్.వంశీకృష్ణ ఉద్యోగ రీత్యా మేం హైదరాబాద్‌లో ఉంటున్నాం. ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు కారులో విశాఖ బయల్దేరాం. తెల్లవారు జామున మంచు అధికంగా ఉండడంతో ప్రత్తిపాడు హైవేలో మినర్వా కళాశాలవద్ద కారు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. కారులో నాతోపాటు నా భర్త, ఇద్దరు పిల్లలు, మా ఇంట్లో పనిచేసే మహిళ ఉన్నాం. ఆ సమయంలో మా ముగ్గురికి తీవ్ర గాయాలవ్వగా పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే 108 వాహనంలో మమ్మల్ని ప్రత్తిపాడు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఆ సమయంలో మా కారులో మూడు ల్యాప్‌ట్యాప్‌లతోపాటు మరో బ్యాగులో రూ.15లక్షల విలువైన బంగారు వస్తువులు ఉన్నాయి. వాటిని భద్రపరచాలని పోలీసులకు తెలిపాం. వారు సరేనన్నారు. ఇప్పుడు ఆ బంగారు వస్తువులు లేవని చెప్తున్నారు. పోలీసులు తప్ప ఆ కారు వద్దకు ఎవరూ వెళ్లలేదు. మా బంగారు ఏమైందో విచారణ జరిపి న్యాయం చేయాలి. రెండు నెలలుగా నేను, నా భర్త మంచానికే పరిమితం కావడంతో ఫిర్యాదు చేసేందుకు రాలేకపోయాం.



-లక్ష్మీదీప్తి, ఆమె భర్త వంశీకృష్ణ

గురుకుల పాఠశాలలో దాడి ఘటనపై విచారణ


విద్యార్థులను విచారిస్తున్న కన్వీనర్ ఎర్నెస్ట్

కరప, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరప మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో పలువురు పదోతరగతి విద్యార్థులపై ఓ పార్టీ నాయకులు దాడి చేసిన ఘటనపై సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. బీసీ గురుకుల పాఠశాలల కాకినాడ జిల్లా కన్వీనర్ సీకేపీ ఎర్నెస్ట్ పాఠశాలకు విచ్చేసి దాడికి గురైన విద్యార్థులను విచారించారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, ఇతర ఉపాధ్యాయులను విచారించి వారి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాఠశాలను సందర్శించి ఘటనపై విచారించారు. విద్యార్థులతో సమావేశమై దాడిచేసినవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకుడు పెంకే సత్తిబాబు, జనసేన నాయకులు బోగిరెడ్డి కొండబాబు, యాళ్ల పండు పాఠశాలను సందర్శించి దాడిపై ఆరా తీశారు.

పీహెచ్‌సీ నిర్వహణకు ఉత్తర్వులు

కాకినాడ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టు లిమిటెడ్ స్థానిక దుమ్ములపేటలో రూ.2కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం జీవో నంబర్ 134 విడుదల చేసింది. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, వైద్యులు, ఇతర సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌కు సూచించింది.

పాడా పీడీగా చైత్రవర్షిణి బాధ్యతల స్వీకరణ

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ (పాడా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఏ.చైత్రవర్షిణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని మున్సిపల్ అతిథిగృహంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాడా తాత్కాలిక కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. చైత్రవర్షిణి ఇప్పటి వరకూ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఓఎస్డీగా పనిచేశారు. చైత్రవర్షిణి సోమవారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌హన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాలను మర్యాద పూర్వకంగా కలిశారు. చైత్రవర్షిణి జిల్లా పర్యాటక శాఖాధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.


కలెక్టర్‌ను కలిసిన పాడా పీడీ చైత్రవర్షిణి

మరిడమ్మ ఆలయ ట్రస్టీ మృతి


బ్రహ్మాజీ (ఫైల్)

పెద్దాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ(78) సోమవారం మృతిచెందారు. బ్రహ్మాజీ మరణ వార్త పట్టణ ప్రజలను విషాదంలో ముంచేసింది. ఇటీవల అనారోగ్యానికి గురైన బ్రహ్మాజీ చికిత్స పొందుతూ సామర్లకోట ఆయన నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. బ్రహ్మాజీ మృతి పట్ల ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిసిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

'చేసిన సేవలతోనే గుర్తింపు'

కరప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన మంచి పనులు, అందించిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు పేర్కొన్నారు. కరప ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేసి సచివాలయ ఉద్యోగం రావడంతో వెళ్లిపోయిన వాసంశెట్టి రాము సన్మాన కార్యక్రమం సోమవారం కరప చంద్రన్న సమావేశ మందిరంలో జరిగింది. ఎంపీపీ ముఖ్యఅతిథిగా విచ్చేసి రామును సత్కరించి మెమెంటో అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, సీసీలు ప్రకాష్, స్వామి, రాజేంద్ర, జనసేన నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. మహాశివరాత్రి సందర్భంగా గత నెల 26న అన్నవరం నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రానికి దర్శనం నిమిత్తం తొమ్మిది మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆటో గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో బి.ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పార్సిల్ వేన్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన అమృతీ చంద్రరావు(55) కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు చెల్లించాలని విజయవాడలో జరిగే ధర్నాకు బయలుదేరిన అంగన్‌వాడీలను తుని, సామర్లకోట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కచేరిపేట సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, శంఖవరం రాజేశ్వరి పాల్గొన్నారు.

వేళంగిలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


కరపలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కరప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేళంగిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు, వేదపండితులు స్వామివారి దివ్య కల్యాణాన్ని వేడుకగా జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మాజీ మంత్రి, వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కరప వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీభూ సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర, ఈవోలు కె.తిరుమలరవితేజ, సౌజన్య, మురళీవీరభద్రరావు, వడ్డాది సత్తిబాబు, మాచిరాజు లక్ష్మీనారాయణ, కాట్నం జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

కరప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షా సామగ్రి అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తి మేరకు శ్రీచైతన్య, విజయగాయత్రి విద్యాసంస్థల యాజమాన్యం పరీక్ష అట్ట, పెన్నులు, పెన్సిళ్లు తదితర మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాజ్యోతి, హెచ్ఎం ప్రసాద్‌కుమార్, చైతన్య కాలేజీ ఏజీఎం రాంబాబు, ప్రిన్సిపాల్ సురేష్, రమేష్, నాయకులు దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, ముద్రగడ రమేష్, యాళ్ల పండు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో స్వామివారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య విశేష అభిషేకపూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిత్యాన్నదాన పథకంలో 500మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ వెలుపల గల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆవరణలో 300 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సామర్లకోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో వేంచేసియున్న రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని సోమవారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈపూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ పండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపం వద్ద ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనం అందించారు.

పండుగలా జనసేన ఆవిర్భావ సభ


తాటిపర్తిలో ఉపాధి కూలీలను కలిసి జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలని కోరుతున్న పీవీఎస్ఎన్ రాజు

గొల్లప్రోలు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, ఆవిర్భావ సభ నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల14న జరిగే ఆవిర్భావ సభకు తరలిరావాలని కోరు తూ గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి, చినజగ్గంపేట, కొడవలి, వన్నెపూడి, దుర్గాడ, ఏ.విజయనగరం, చేబ్రోలు, ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృత ప్రచారం నిర్వహించారు. పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులు, ఉపాధి పనుల్లో ఉన్న కూలీలను కలిశారు. ఆయా గ్రామాల్లో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలుతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆవిర్భావ సభకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి లక్షలాది మంది తరలివస్తారని, వారందరికి ఆతిథ్యం ఇవ్వడంతో పాటు సభకు ప్రజలంతా తరలివచ్చేలా చూడాలన్నారు.పిఠాపురం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ లక్ష్యమని తెలిపారు. జనసేన పార్టీ నాయకులు వెన్నపు చక్రధరరావు, తుమ్మలపల్లి చందు, బవిరిశెట్టి రాంబాబు, ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, జయకృష్ణ, హబీబ్‌బాషా, రామిరెడ్డి, నాగగౌరీలక్ష్మీ, వినుకొండ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను పలువురు జనసేన ముఖ్యనేతలు సోమవారం పరిశీలించారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో సిద్ధమవుతున్న సభా ప్రాంగణం, ఇతర ఏర్పాట్లును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, కార్యక్రమాల నిర్వహణా కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. వారి వెంట పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


గర్భిణులకు పండ్లు అందిస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి

కరప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తపడాలని అలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కరప పీహెచ్‌సీలో సోమవారం ఆయన పలువురు గర్భిణులకు పండ్లు పంపిణీచేసి మాట్లాడారు. ఐరన్ ఎక్కువగా ఉండే కాయగూరలు, పండ్లు, గుడ్లు, వేరుశనగ అచ్చులు విరివిగా తీసుకోవాలని సూచించారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఏంజెలిన్, అలయన్స్ క్లబ్ గవర్నర్ అలైవనుం శ్రీనివాసరావు, పెంకే శివకుమార్, పెంకే గోవిందరాజు, వి.ప్రసాద్, వీరభద్రరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సత్యనారాయణమ్మ, ఎల్‌టీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా రైతులంతా మామిడితోటల పెంపకం పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం దుంప పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీత, పెద్దాపురం మండల ఉద్యానశాఖాధికారి ఎన్.సుజాత కోరారు. మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో సోమవారం మామిడితోటల క్షేత్రప్రదర్శన చేసి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండల తీవ్రత అధికం కానున్న నేపథ్యంలో మామిడితోటలకు తేలికపాటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టే దశలో రెండో దఫా ఎరువులను సిఫార్సు ప్రకారం వేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్

పెద్దాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్లు తెలిపారు. ఈసందర్భంగాఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీచేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో మాధవరావు, డీటీ బానుకుమార్, ఏఈ రవిశంకర్, ఐసీడీఎస్ సీడీపీవో ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువత పోరుపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సామర్లకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో ఈనెల12న వైసీపీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు కోరారు. సామర్లకోట వైసీపీ కార్యాలయంలో సోమవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా యువతపోరు గోడపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి


మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పిఠాపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు విజయవాడలో ఈనెల 12న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల సింహాచలం కోరారు. పిఠాపురం మండలం మంగితుర్తి, విరవాడ, వెల్దుర్తి, పి.తిమ్మాపురం, రాయవరం, రాపర్తి గ్రామాల్లో సోమవారం సంఘం నాయకులు కరపత్రాలు ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉపాధి పెండింగ్ బిల్లులు, వేతనాలు తక్షణం చెల్లించాలన్నారు. కేంద్రం ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయింపులు తగ్గించడం ద్వారా ఈపథకాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఉపాధి కూలీల వేతనం రోజుకి రూ.500కి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఊబా బుల్లబ్బాయి, కాల్దారి రాఘవ, డెక్కల లాజరు, దవ్వాల కృష్ణ, సుబ్బు, లక్ష్మీ, రత్నం పాల్గొన్నారు.

వాడివేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దృశ్యం

పెద్దాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ మెప్మా విభాగం అధికారులు ప్రవర్తించిన తీరుపై మండిపడ్డారు. మహిళా దినోత్సవంపై కనీసం మహిళా కౌన్సిలర్లకు సమాచారం అందించి ఉంటే బాగుండేదని కేవలం మెప్మా అధికారులే కౌన్సిల్ సభ్యులను పక్కన పెట్టి అగౌరపర్చడం సరైన పద్ధతి కాదన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో పందులు స్వైర విహారంపై పందులు యజమానులతో సమావేశం నిర్వహించాలని గత కౌన్సిల్‌లో సూచించినా పందుల సంచారంపై చర్యలు లేవన్నారు. ప్రస్తుత వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో కమ్యూనిటీ హాల్స్ వద్ద జరిగే విందు బోజనాలతో వచ్చే చెత్త మున్సిపల్ శానిటరీ సిబ్బంది ఎత్తుతున్న నేపథ్యంలో ఫంక్షన్‌దారుల నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్ములు ఎందుకు వసూలు చేయడంలేదన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌కు అదే స్థలం పునఃనిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై వాడివేడీగా చర్చ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతి, డీఈ ప్రకాశరావు, మేనేజర్ జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు.

విజయగణపతి స్వామివారి ఆలయ వార్షికోత్సవం

కరప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నడకుదురు రామలింగేశ్వరకాలనీలో సోమవారం విజయగణపతి స్వామివారి ఐదో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు చేయగా భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి తన తండ్రి మాణిక్యాలరావు జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు రామలక్ష్మి, సూర్యప్రకాశరావులతో కలిసి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆదిలక్ష్మిని ఘనంగా సత్కరించారు. యంగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు వాకాడ చిన్న మాస్టారు, అచ్చిరెడ్డి, శ్రీమన్నారాయణ, చాగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రరావుకు చంద్రమౌళి పరామర్శ



సామర్లకోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పితృ వియోగంలో బాధపడుతున్న టీడీపీ నాయకుడు గుణ్ణం వీరభద్రరావును సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి గుణ్ణం చంద్రమౌళి పరామర్శించారు. ఇటీవల వీరభద్రరావు తండ్రి వయోభారంతో మృతి చెందిన విషయం విదితమే. వేట్లపాలెంలోని వీరభద్రరావు స్వగృహంలో వెంకట్రావు చిత్రపటానికి చంద్రమౌళి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, నున్న వెంకట్రాజు, మార్ని వెంకయ్య, అడబాల చిట్టిబాబు, గుణ్ణం సురేష్ ఉన్నారు.

జగ్గంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈ నెల 14న జనసేన ఆవిర్భావ సభ జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ప్రోగ్రామింగ్

జనసేన ఆవిర్భావ సభ
ఏర్పాట్ల పరిశీలన

కమిటీ చైర్మన్ కేకేతో కలిసి గ్రౌండ్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్, జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణ సోమవారం పరిశీలించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన అస్థిత్వాన్ని జగన్ దెబ్బతీశారు

• అసెంబ్లీలో ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనుల అస్థిత్వాన్ని గత ప్రభుత్వం దెబ్బతీసిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం అసెంబ్లీలో మాట్లాడారు. బడ్జెట్‌పై సాగుతున్న చర్చలో భాగంగా డిప్యూటీ స్పీకర్ రఘురామ క్రిష్ణంరాజు ఇచ్చిన అవకాశం మేరకు ఆమె మాజీ సీఎం జగన్‌రెడ్డిపై దుమ్మెత్తి పోశారు. టీడీపీ ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే ... ఆయనకు అరకు గంజాయిని ప్రమోట్ చేశారన్నారు. బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి ఇచ్చిన ప్రాధాన్యతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో వాల్మీకి గిరిజనులకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందుల రీత్యా వారంతా విద్యాభ్యాసానికి దూరమవుతున్నారన్నారు. మన్యంలో ఎమ్మెల్సీ అనంతబాబు అకృత్యాలపై ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని కోరారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

● పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లిశెట్టి సత్యనారాయణ


జనసేన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బొల్లిశెట్టి

రాజవొమ్మంగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లిశెట్టి సత్యనారాయణ కోరారు. జడ్డంగి మల్లిఖార్జునస్వామి ఆలయ సమీపంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్‌ను వారితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏజెన్సీలో 11 మండలాల్లో జనసేన నాయకులు, వీరమహిళలతో సమావేశాలు నిర్వ హించామన్నారు. కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ ప్రసంగి ఆదినారాయణ, కుర్ల రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని...

- రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా


రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

రంపచోడవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజనులు జీడిమామిడి తోటల నుంచి సేకరించిన జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐకెఎంఎస్, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరంలో ఆందోళన జరిపారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రధాన గేటు ఎదుట గిరిజనులు బైఠాయించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు అనసూయ, పల్లాల ఆదిలక్ష్మి, కలుగుల మురళి, ఐవీ రమణ, పల్లాల ధర్మారెడ్డి, రేవుల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ లక్ష్యం మేరకు సిబ్బంది పనిచేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మారేడుమిల్లి, మార్చి 10 ((ఆంధ్రజ్యోతి): మండల ప్రగతి బాగుండాలంటే ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బందితో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. మారేడుమిల్లి, సున్నంపాడు, జీఎం వలస పంచాయతీల్లో అక్రమ కట్టడాలు, టూరిస్ట్ రిసార్ట్స్ ఉన్నాయని వారందరికీ త్వరలో తాఖీదులు జారీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ సహాయ ఇంజనీర్లు బి.నారాయణ రావు, రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జల విద్యుత్ కేంద్రంలో భద్రతా వారోత్సవాలు


వారోత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులు

మోతుగూడెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో కార్మికులు, ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ఏ విధంగా భద్రతలు తీసుకోవాలో తెలుపుతూ వారితో ఆయన ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీ ఎమ్మార్పీ లక్ష్మణరావు, ఓం స్టాఫ్ కాంట్రాక్ట్ కార్మికులు, పీఎస్ కంపెనీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత వీఆర్‌పురం వారియర్స్ జట్టు


టోర్నీని గెలుచుకున్న వీఆర్ పురం వారియర్స్ జట్టు

చింతూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చింతూరులో నిర్వహించిన సీపీఎల్ క్రికెట్ టోర్నీని వీఆర్‌పురం జట్టు కైవసం చేసుకుంది. విన్నర్ జట్టుకు రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన చింతూరు క్రికెట్ అసోసియేషన్ టీమ్‌కు రూ.20 వేల నగదు బహుమతులతో పాటు కప్‌లను నిర్వాహకులు అందజేశారు. ఉప ఎంపీపీ చిన్ని, జనసేన మండల అధ్యక్షుడు మడివిరాజు, సహింషా, సోంది నాగేశ్వరరావు, చిన్నబ్బి, గణేష్, ప్రదీప్, రమేష్, పాల్గొన్నారు.

వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

చింతూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో వలంటీర్ల సమావేశం వలంటీర్ల యూనియన్ మండల కార్యదర్శి కలుముల మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. వెంకట్ మాట్లాడుతూ వలం టీర్ల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో 17న చలో విజయవాడ ఏర్పాటు చేశామని, దీన్ని జయప్రదం చేయాలని కోరారు. భూక్యా కుమార్, గడ్డల వనరాజ్, సాదుల రామిరెడ్డి, రాజు, లక్ష్మణ్ , తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

దేవీపట్నం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సారా నిర్మూలనకు ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవోదయ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించి సారాకు దూరంగా ఉండాలని పిలుపునిస్తున్నారు. సోమవారం దేవీపట్నం, గంగవరం మండలాల్లో నవోదయం 2.0 కార్యక్రమాలు నిర్వహించినట్టుఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు. గంగవరం మండలం పాత రామవరం, దేవీపట్నం మండలం ఎస్.రామన్నపాలెం, చిన్నభీంపల్లి గ్రామాల్లో పెద్దల సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు.

చింతూరు సెంటరులో చలివేంద్రం ఏర్పాటు

చింతూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చే క్రమంలో చింతూరు సెంటరులో పలువురు ముస్లింలు సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇజా అహ్మద్, షేక్ సుభానీ, ఎండీ జవహర్, మర్షిద్, కరీముల్లా, దస్తగిరి పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వైభవంగా తాళ్లూరు జియ్యన్న తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


గజేంద్ర పుష్కరిణలో భక్తుల స్నానాలు

గండేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు జియ్యన్న మఠంలో వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున 3.30 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గజేంద్ర పుష్కరణిలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో ఉనమట్ల రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య ఏర్పాట్లు చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు నేతృత్వంలో సిబ్బంది తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు జాతీయ రహదారి నుంచి ఆలయానికి వెళ్లే దారిలో మంచినీరు, మజ్జిగ, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. స్వామివారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, టీడీపీ యువ నాయకుడు జాస్తి వసంత్, పలువురు వీఐపీలు, రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉప సర్పంచ్ పైణ్ణి వెంకటేశ్వరరావు, సభ్యులు కొండ్రు అప్పలరాజు, బి.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు.



జగ్గంపేటలో రాజగోపాలస్వామిని దర్శించుకుంటున్న అప్పలరాజు, కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి కల్యాణ దృశ్యం

ఘనంగా రాజగోపాలస్వామి కల్యాణం

జగ్గంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంత మార్కెట్ సెంటర్లోని విష్ణు ఆలయంలో రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట మాజీ ఎంపీపీ ఎస్వీఎస్ నాగలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం శ్రీరమా సత్యనారాయణస్వామి కల్యాణంతో ప్రారంభమై నీరాజన మంత్రపుష్పాలు, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తు పూజ, ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ క్రతువును తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), దాట్ల సురేష్‌రాజు, పీటీ ప్రసాద్, మానేపల్లి సాయి, గెడ్డమూరి బాబి, పత్రి భీమేశ్వరరావు, అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి కల్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు అంగర లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపించారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు తిలకించారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఏడో వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం జరిపారు.

వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూడు జిల్లాల నుంచి మహిళలు, భక్త బృందాలు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి సామూహిక లలితా పారాయణ, 12లక్షల లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.




తొండంగిలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం, గండేపల్లిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

తొండంగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గడ్డిపేట ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయునిలు శ్రీదేవి, పుష్ప, గీతాభవాని, గంగయ్యమ్మ, జయ, వెంకటరమణిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మహిళా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. బద్ది లోవరాజు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎంపీడీవో నాతి బుజ్జి పుష్పమాల వేసి నివాళులర్పించారు. పరిపాలనాధికారి కె.చంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కత్తిపూడిలో విద్యార్థికి పరీక్ష కిట్ అందజేస్తున్న తమ్మయ్యనాయుడు, ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో విద్యార్థుల సరస్వతీ పూజ

'ఒత్తిడిని జయిస్తే విజయమే'

శంఖవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం వరిస్తుందని మాధురి విద్యా సంస్థల చైర్మన్ తమ్మయ్యనాయుడు అన్నారు. కత్తిపూడి పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఫేర్‌వెల్‌డేలో ఆయన పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కడారి సీతాదేవి, మమత, ప్రిన్సిపాల్ ఆదినారాయణ, నాగబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి భారతి విద్యా సంస్థల ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థులు గణపతి, సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కరస్పాండెంట్ సుంకర వీరబాబు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

'ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది'

జగ్గంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్నాడని ప్రణయ్‌ను చంపిన కేసులో కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ అన్నారు. దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేసిన కేసులో నిందితులకు కూడా ఇదే విధంగా శిక్ష వేయాలన్నారు.

రేపు 'ఫీజు పోరు' యాత్ర

కిర్లంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పిలుపు మేరకు బుధవారం 'ఫీజు పోరు' యాత్ర నిర్వహిస్తున్నట్టు వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన కిర్లంపూడిలో ఆ పార్టీ నాయకులతో కలిసి సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పరిశ్రమ సందర్శన

గండేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 49 మంది పెద్దాపురంలోని అంజ్లియన్ లాజిస్టిక్స్ శీతల గిడ్డంగిని సోమవారం సందర్శించారు.

అర్జీ ఆరాటం... పరిష్కార పోరాటం...

కాకినాడ కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ఈ సోమవారం అర్జీదారులు పోటెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు, నాలుగు వారాలుగా పీజీఆర్ఎస్ నిర్వహించకపోవడం.. ఈ సోమవారం అర్జీలు స్వీకరిస్తుండడంతో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి అర్జీదారులు తరలివచ్చారు. తమ సమస్యల అర్జీలను జిల్లా అధికారులకు అందజేశారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్దకు చేరుకున్నారు.

బంగారం వస్తువులు మాయం...

నా పేరు లక్ష్మీదీప్తి.. మాది వైజాగ్. నా భర్త ఆర్.వంశీకృష్ణ ఉద్యోగ రీత్యా మేం హైదరాబాద్‌లో ఉంటున్నాం. ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు కారులో విశాఖ బయల్దేరాం. తెల్లవారు జామున మంచు అధికంగా ఉండడంతో ప్రత్తిపాడు హైవేలో మినర్వా కళాశాలవద్ద కారు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. కారులో నాతోపాటు నా భర్త, ఇద్దరు పిల్లలు, మా ఇంట్లో పనిచేసే మహిళ ఉన్నాం. ఆ సమయంలో మా ముగ్గురికి తీవ్ర గాయాలవ్వగా పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే 108 వాహనంలో మమ్మల్ని ప్రత్తిపాడు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఆ సమయంలో మా కారులో మూడు ల్యాప్‌ట్యాప్‌లతోపాటు మరో బ్యాగులో రూ.15లక్షల విలువైన బంగారు వస్తువులు ఉన్నాయి. వాటిని భద్రపరచాలని పోలీసులకు తెలిపాం. వారు సరేనన్నారు. ఇప్పుడు ఆ బంగారు వస్తువులు లేవని చెప్తున్నారు. పోలీసులు తప్ప ఆ కారు వద్దకు ఎవరూ వెళ్లలేదు. మా బంగారు ఏమైందో విచారణ జరిపి న్యాయం చేయాలి. రెండు నెలలుగా నేను, నా భర్త మంచానికే పరిమితం కావడంతో ఫిర్యాదు చేసేందుకు రాలేకపోయాం.


బంగారు వస్తువుల మాయంపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన లక్ష్మీదీప్తి, వంశీకృష్ణ దంపతులు

ఆధునిక సర్వేయింగ్‌పై అవగాహన

గండేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక సర్వేయింగ్ అంశంపై రెండు రోజులు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ వి.సాయికృష్ణ మాట్లాడుతూ జీపీఎస్, టోటల్ స్టేషన్ వంటి ప్రాక్టికల్ ప్రదర్శన ద్వారా విద్యార్థులు అవగాహన పొందుతారన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.తేజస్విని పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సోమవారం అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం టీడీపీ గండేపల్లి మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆర్థిక సహాయంతో 500 మంది పేదలకు అన్నదానం చేశారు. బొల్లం రెడ్డి రామకృష్ణ, మారిశెట్టి రాధా, కంటిపూడి రామారావు, బద్ది సురేష్, సుబ్బయమ్మపేట మాజీ సర్పంచ్ బొండా శ్రీను, డేగల సత్తిబాబు, గద్దె మారుతి, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


'విశ్వకర్మ యోజన ద్వారా రుణాలు ఇవ్వాలి'

ప్రత్తిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ యోజన పథకంలో రుణాలు మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఎస్‌బీఐ మేనేజరును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు అత్తిలి బ్రహ్మ, జిల్లా క్రమశిక్షణ కమిటీ సభ్యుడు దర్నాలకోట శ్రీను, ప్రత్తిపాడు శాఖ అధ్యక్షుడు గానాల గంగాధర్, దర్నాలకోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి'

ఏలేశ్వరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రమణ సస్పెన్షన్‌ను కార్మికులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆర్టీసీ ఏలేశ్వరం డిపో మేనేజరు జీవీ సత్యనారాయణ కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలేశ్వరం నుంచి విజయవాడ వెళ్తున్న బస్సులో రాజమహేంద్రవరంలో ఎక్కిన ప్రయాణికురాలు టికెట్ నిమిత్తం రూ.300 ఇచ్చిందన్నారు. డ్రైవర్ రమణ ఆమెకు టికెట్ కానీ, చిల్లర కానీ ఇవ్వలేదని విజిలెన్స్ అధికారుల తనిఖీలో తేలిందన్నారు. అనంతరం అందుబాటులో ఉన్న సమాచారం మేరకు నిబంధనలను అనుసరించి సస్పెండ్ చేశామన్నారు. ఈ విషయాన్ని కార్మికులు గమనించాలన్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి తప్ప నిబంధనలకు విరుద్ధంగా నిరసన తెలపడం సరికాదన్నారు.

మహాసేన రాజేష్‌కు పితృ వియోగం


సుందర్‌సింగ్ (పాత చిత్రం)

ప్రత్తిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మహాసేన రాజేష్‌కు పితృ వియోగం కలిగింది. అనారోగ్యంతో కొన్ని రోజులుగా ఏలేశ్వరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తండ్రి సాదు సుందర్‌సింగ్ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు భార్య స్వరాజ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు రాజేష్, రమేష్‌కుమార్, ఒక కుమార్తె ఉన్నారు. ఉత్తరకంచిలో సుందర్‌సింగ్ పార్థివ దేహానికి రాజేష్ అనుచరులు, అభిమానులు, కార్యకర్తలు, దళితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రైస్తవ సంప్రదాయరీతిలో అంత్యక్రియలు నిర్వహించారు.